నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, శనివారం 23 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

నాగోబా ఆలయంలో ఆత్రం సక్కు పూజలు

ఆసిఫాబాద్, మార్చి 22 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాగోబా ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు గుర్తు చేశారు. ఆదివాసుల సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో తనను ఎంపీగా గెలిపిస్తే ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మీ బిడ్డగా ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఆయనను ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆదివాసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

నిలబడే విధులు

- మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ ఆస్తులు జప్తు చేయడంతో ఇబ్బందుల్లో సిబ్బంది

మంచిర్యాల అర్బన్, మార్చి 22 : కోర్టు ఆదేశాల మేరకు మంచిర్యాల ఆర్డీవో కార్యాలయ ఆస్తులు జప్తు చేయడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. కుర్చీలు లేక నిలబడే విధులు నిర్వహిస్తున్నది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏ సమాచారమైనా కార్యాలయ మెయిల్‌కు వస్తుంటుంది. కంప్యూటర్లు సైతం సీజ్ చేసి తీసుకెళ్లడంతో చేసేదేమి లేక సెల్స్ చూస్తు సమాచారం తెలుసుకుంటున్నారు. మరోవైపు డెత్ సర్టిఫికెట్లు, ఆలస్యంగా తీసుకునే బర్త్ సర్టిఫికెట్లు, మీ సేవ ద్వారా వచ్చే ఆన్‌లైన్ ఫిర్యాదులు, ధరణి తదితర సేవలన్నీ నిలిచిపోయాయి. ఈ సమస్యకు ఎప్పుడు పరిష్కారమవుతుందో వేచి చూడాలి మరి..

గదుల్లో నిలబడి ఉన్న కార్యాలయ సిబ్బంది

వంశీకి టికెట్‌పై గుస్సా

- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ సీనియర్లు, మాదిగ సామాజిక వర్గం
- ఇవి వారసత్వ రాజకీయాలు కావా.. అంటూ అసహనం
- ఒకే ఇంట్లో రెండు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ టికెట్ ఎట్లిస్తరంటూ మండిపాటు
- మంత్రి, మిగతా ఎమ్మెల్యేలు సహకరించేది కష్టమే!

మంచిర్యాల, మార్చి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి ఎంపీ సీటు కోసం కాంగ్రెస్ నుంచి అనేక మంది పోటీ పడగా, చివరకు గడ్డం వెంకటస్వామి (కాక) మనవడు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు వంశీకి కేటాయించడంపై ఆ పార్టీలో గందరగోళం నెలకొంటుంది. టికెట్ ఆశించి భంగపడ్డ నేతలతో పాటు, కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులు, ముఖ్యంగా మాదిగ సామాజిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ మాదిగలను విస్మరిస్తుందంటూ పెద్దపల్లిలో శుక్రవారం దళిత ఐక్యవేదిక నాయకులు ప్రెస్‌మీట్ పెట్టారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిత్వంపై కాంగ్రెస్ పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్వతంత్ర అభ్యర్థిగా ఓ మాదిగను నిలబెడుతామని, త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామంటూ హెచ్చరించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడు లక్షల మంది మాదిగ సామాజిక వర్గ ఓటర్లున్నారని, అంతా ముక్తకంఠంతో గడ్డం వంశీకి ఎంపీ టికెట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాంటూ చెప్పారు. వంశీకి పెద్దపల్లి టికెట్ ప్రకటించిన మరుసటి రోజే మాదిగ సామాజిక వర్గం షాక్ ఇవ్వడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో గడ్డం ఫ్యామిలీ ఉన్నట్లు తెలుస్తున్నది. పెద్దపల్లి జిల్లాలో మాదిగ సామాజిక వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో మంచిర్యాల జిల్లాలోని ఆ సామాజిక వర్గం గడ్డం ఫ్యామిలీకి సహకరించడంపై సందేహాలు నెలకొన్నాయి.

ఆ కుటుంబానికి ఎందుకంత ప్రాధాన్యం..

వంశీకి టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నాయకులు సైతం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించమని చెబుతూనే.. ఒకే కుటుంబంలో ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి.. ఇప్పుడు ఎంపీ టికెట్ సైతం ఇవ్వడమేమిటని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లిలో ఎంపీలుగా కాక ఫ్యామిలీ తప్ప.. వేరే వాళ్లు ఎవ్వరూ ఉండకూడదా అనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్‌లో తీవ్రంగా సాగుతున్నట్లు తెలుస్తున్నది. అసలు ఆ కుటుంబ సభ్యులను ఎన్నిసార్లు గెలిపించినా పార్లమెంట్ పరిధిలో చేసిందేమీ లేదని, అలాంటోళ్ల చేతుల్లోనే మళ్లీ ఎంపీ టికెట్ పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అని టికెట్ ఆశించిన నాయకులు బాహాటంగానే మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఇన్ని రోజులు పార్టీ కోసం కష్టపడి, టికెట్ వస్తుందని ఖర్చు పెట్టుకుంటే.. మొన్నీమధ్యే పార్టీలోకి వచ్చిన ఆ కుటుంబానికి టికెట్ ఇవ్వడం ఏమిటని నిట్టూరుస్తున్నట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్‌లోని ఇతర సీనియర్లు కూడా గడ్డం వంశీకి సపోర్ట్ చేసే అవకాశాలు కనిపించడం లేదు. మంత్రి శ్రీధర్‌బాబు కొందరు ఎమ్మెల్యేలు ఈ మధ్యనే ఢిల్లీకి వెళ్లి మరీ మాజీ ఎంపీ సుగుణకుమారికి టికెట్ ఇవ్వాలని ఫైరవీలు చేశారు. దీంతో ఇప్పుడు వారంతా ఎంత వరకు వంశీ కోసం పని చేస్తారనేది ప్రశ్నార్థకంగానే మారింది. మంత్రి సపోర్ట్ లేకుండా ఆయన పార్లమెంట్ నియోజకవర్గంలో గెలవడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే పీఎస్సార్ వంశీకి సపోర్ట్ చేసేలా లేరు. అటు మంత్రితో పాటు ఇటు ముందు నుంచి పార్టీనే పట్టుకొని పని చేసిన పీఎస్సార్‌లాంటి ఎమ్మెల్యేలకు ఇది ఎంత వరకు రుచిస్తుందో చూడాలి. అంతా కలిసి కష్టపడి గెలిపించినా గడ్డం ఫ్యామిలీనే ఆ క్రెడిట్ కొట్టేస్తుందని.. మంత్రి పదవి కూడా డిమాండ్ చేస్తుందని.. అదే జరిగితే తామంతా ఆ కుటుంబం చేతిలో పావులుగా మారాల్సిందేనని అంతా భావిస్తున్నారంట. అదే నిజమైతే పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో గడ్డం సోదరులు ఎమ్మెల్యేలుగా ఉన్న బెల్లంపల్లి, చెన్నూర్‌లో తప్ప మిగిలిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సహకరించేలా లేరనే చర్చ జోరుగా సాగుతున్నది.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

మంచిర్యాల అర్బన్, మార్చి 22 : జిల్లా కేంద్రంలోని ఏసీసీ-3 అంగన్‌వాడీ టీచర్ పద్మ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వుమెన్ అచీవర్స్- 2024 అవార్డు అందుకున్నారు. ఈ మేరకు శుక్రవారం యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్లి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు పర్శ రాజన్న యాదవ్, నాయకులు బూస మహేశ్ యాదవ్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో

పైవేటు షెడ్లు

- కేసీఆర్ సర్కారులో రెండుసార్లు కట్టడాలు కూల్చివేత
- కాంగ్రెస్ గెలిచిన వెంటనే మళ్లీ మొదలు
- అప్పుడు ప్రభుత్వానిదైన భూమి.. ఇప్పుడెట్లా కాకుండా పోయిందో?
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో దర్జాగా అక్రమ నిర్మాణాలు

అర్ధరాత్రి బోర్ వేస్తున్న

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 42లో అక్రమ నిర్మిస్తున్న షెడ్లు

మంచిర్యాల, మార్చి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 42లోగల 8 గుంటల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొందరు ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ భూమిలో దర్జాగా కట్టడాలు చేపడుతుండగా, అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత కేసీఆర్ సర్కారు ఇక్కడ నిర్మించిన షెడ్లను రెండు సార్లు కూల్చివేయగా, అలా కాంగ్రెస్ గెలిచిందో లేదో.. తిరిగి అదే భూమిలో కట్టడాలు ప్రారంభించడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.

ఇండ్లు లేకుండానే ఇంటి నంబర్లు..

నస్పూర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో సర్వే నంబర్ 42లో ఎలాంటి ఇండ్లు లేవు. కానీ, ఉన్నట్లుగా ఇంటినంబర్లు సంపాదించారు. అలా ఇంటి నంబర్లు ఉన్నాయని చెప్పి నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు అక్రమార్కులు ఎన్నో ప్రయత్నాలు చేశారు. వాస్తవానికి ఇప్పుడు ఎక్కడైతే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారో అక్కడున్న 12 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ కోసం కేటాయించింది. అది పక్కా ప్రభుత్వ భూమి, పైగా మిషన్ భగీరథ కోసం కేటాయించిన భూమి, ఇందులో నిర్మాణాలు ఎలా చేపడుతారంటూ గతంలో అధికారులు అక్రమ నిర్మాణాలు, కంచెలను తొలగించుకుంటూ వచ్చారు. ఇలా 2021 ఏప్రిల్‌లో ఒకసారి, 2023లో మరోసారి నిర్మాణాలను కూల్చివేశారు. కానీ, డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలైపోగానే అక్రమ నిర్మాణాలు మళ్లీ మొదలయ్యాయి. దీంతో అప్పుడు ప్రభుత్వానిదైనా ఈ భూమి ఇప్పుడు కాకుండా పోయిందా అని స్థానికులు నిలదీస్తున్నారు. ఇండ్లు కట్టుకుంటూ పోతుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఎమ్మార్వో,, మున్సిపల్ కమిషనర్, జాయింట్ కలెక్టర్లను కలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్వో తేల్చినా...

ఇదే భూమిలో గతంలో చేపట్టిన నిర్మాణాలను కూల్చినప్పుడు సదరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై అప్పుడు నస్పూర్ ఎమ్మార్వోగా ఉన్న జ్యోతి అసలు అక్కడ ఎలాంటి నిర్మాణాలు, షెడ్లు లేవని, వీళ్లకు ఇంటి నంబర్లు ఇచ్చినట్లు కూడా లేదని రిట్ పిటిషన్ వేశారు. అప్పటి నుంచి ఈ విషయం కోర్టులోనే ఉంది. కానీ ఎలాగైనా భూమిని దక్కించుకోవాలనే అక్కసుతో నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటయ్యాక ఆ ఇంటి నంబర్లతో ఆన్‌లైన్‌లో ట్యాక్స్ కట్టడం మొదలుపెట్టారు. దీన్ని గుర్తించిన అప్పటి మున్సిపల్ కమిషనర్ నవంబర్ 11, 2023లో పన్నులు కట్టిన ఆరు ఇంటి నంబర్ల(5-100087, 5-100093, 5-100094, 1-100090, 5-100091, 5-100095)లో ఓపెన్ ప్లాట్‌లున్నాయని, అందుకని ఈ ఆరు అసెస్‌మెంట్స్‌ని సీడీడీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ నుంచి తొలిగించామని నస్పూర్ తహసీల్దార్‌కే లేఖ రాశారు. ఆన్‌లైన్‌లో కట్టిన ట్యాక్స్‌ను రద్దు చేసినట్లు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. గతంలో ఇంత చేసిన అధికారులు.. ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది.

పక్కా ప్లాన్..

కాగా అధికారుల నిర్లక్ష్యం తమకు కలిసి వచ్చేలా అక్రమార్కులు పక్కాగా ప్లానింగ్ చేస్తున్నట్లు స్పష్టం అవుతున్నది. తమకు కోర్టు ఆర్డర్ ఉందని చెప్తూ ఆరు ఇండ్లు కట్టేశారు. అంతేగాకుండా రాత్రికిరాత్రే బోర్ వెల్ వేశారు. సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేశారు. ఇక ఇప్పుడు అధికారులు వచ్చి ఆ నిర్మాణాలను కూలిస్తే ఆ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో రికార్డు అవుతాయి. అప్పుడు ఉన్న ఇండ్లను కూల్చి అసలు అక్కడ ఏం నిర్మాణాలు లేవని అధికారులు చెప్తున్నారని కోర్టుకు ఆధారాలు చూపించేందుకు ఈ ప్లాన్ చేస్తున్నారనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఒకవేళ నిజంగానే కోర్టు ఆర్డర్ ఉంటే నిర్మాణాలకు డైరెక్షన్ ఇచ్చే అవకాశమైతే లేదు. మరి ఎందుకు అధికారులు నిర్మాణాలు జరుగుతున్నప్పుడే అడ్డుకోవడం లేదో అంతుపట్టడం లేదు. ఈ స్థలం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పక్కనే ఉండగా, కావాలనే కొందరు వెనుకుండి ఈ అక్రమ నిర్మాణాలను ప్రోత్సాహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిలోని అక్రమ నిర్మాణాలను తొలగిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

లెక్చరర్లు మందలించారని

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

- బెల్లంపల్లిలోని కాలేజీ ఎదుట విద్యార్థుల ధర్నా
- ఏసీపీ జోక్యంతో ఆందోళన విరమణ
- చేర్యాలలో హెచ్‌వోడీతో పాటు ఇద్దరు లెక్చరర్లపై కేసు

వైష్ణవి (ఫైల్)

ఆందోళన చేస్తున్న కళాశాల విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 22 : తోటి విద్యార్థిని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న క్లాస్ రిప్రజెంటేటివ్(క్లాస్ లీడర్)ను లెక్చరర్లు మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన బెల్లంపల్లిలో కలకలం రేపింది. కుటుంబ సభ్యులు, విద్యార్థుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఓడేడ్ గ్రామ పంచాయితీ పరిధిలోని కల్వపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు, కమలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె భీముని వైష్ణవి(20) బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ (ఈఐ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. ఈ నెల 14న కళాశాలలో ఓ విద్యార్థి పుట్టిన రోజు వేడుకల్లో వైష్ణవి (సీఆర్) తోటి విద్యార్థినులతో కలిసి పాల్గొన్నది. మరుసటి రోజు ఈఐ హెచ్‌వోడీ సాంబయ్య, లెక్చరర్లు మాలతి, నాగరాజు ఆమెను పిలిపించి గట్టిగా మందలించారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న ఆమె అదేరోజు సాయంత్రం తనకు తల తిరుగుతుందని వార్డెన్‌కు చెప్పింది. ఈనెల 16న విద్యార్థినులతో కలిసి బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్య చికిత్సలు చేసిన ఆమెకు న్యూరో సమస్య ఉందని, కార్పొరేట్ దవాఖానకు తరలించాలని సూచించారు. వెంటనే హెచ్‌వోడీ సాంబయ్య వారి తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు వచ్చి చేర్యాలకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో 17న సాయంత్రం వైష్ణవి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చేర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. దవాఖానలో చికిత్స పొందుతూ ఈ నెల 21న సాయంత్రం మృతి చెందింది. ఆమె తండ్రి నర్సింహులు తన కూతురు హెచ్‌వోడీ సాంబయ్య, లెక్చరర్లు మాలతి, నాగరాజు వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చేర్యాల పోలీసులు ఈ ముగ్గురిని చేర్యాల పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఫోన్ ద్వారా శుక్రవారం సమాచారం అందించారు.

పాలిటెక్నిక్ కళాశాల వద్ద ధర్నా

లెక్చరర్ల వేధింపులతోనే వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపిస్తూ విద్యార్థులు శుక్రవారం తరగతులను బహిష్కరించి కళాశాల మెయిన్ గేట్ వద్ద ధర్నా చేశారు. సంబంధిత లెక్చరర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అక్కడి నుంచి కొత్త బస్టాండ్ మెయిన్ రహదారిపై నిరసన వ్యక్తం చేయడానికి బయలు దేరారు. సమాచారం అందుకున్న పోలీసులు కళాశాల ముందే వారిని అడ్డుకున్నారు. పోలీసులు, విద్యార్థులకు కొంత సేపు వాగ్వాదం జరిగింది. వెంటనే వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ వచ్చి వారిని సముదాయించడానికి యత్నించారు. లెక్చరర్లను అరెస్టు చేసేంత వరకూ ఆందోళన విరమించబోమని పట్టుబట్టారు. ముగ్గురిపై చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఆందోళన విరమించాలని ఎస్‌హెచ్‌వో దేవయ్య సూచించారు. ఇక్కడి పోలీసులు అరెస్టు చేయలేరని కూడా వివరణ ఇచ్చారు. అయినా విద్యార్థులు మూడు గంటల పాటు ఆందోళన చేయగా, ఉద్రిక్తత నెలకొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని కళాశాల లెక్చరర్లు హామీ ఇవ్వడం, ఏసీపీ జోక్యం చేసుకొని ఆందోళన విరమించాలని కోరడంతో విద్యార్థులు మధ్యాహ్నం తరగతులకు వెళ్లారు.

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్,మార్చి 22 : లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, ఇందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ సురేశ్‌కుమార్, ఏఎస్పీ ప్రభాకర్ రావు, డీఆర్వో లోకేశ్వర్ రావు,డీఎస్పీ సదయ్యతో కలిసి ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గంలో విధులు నిర్వహించే నోడల్ అధికారులు, సెక్టోరల్ తహసీల్దార్లు, ఎంపీడీవో, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులు, పోలీసు సెక్టోరల్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం సిర్పూర్‌లో 320, ఆసిఫాబాద్‌లో 356 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 676 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. సమస్యాత్మక, షాడో పోలింగ్ కేంద్రాలను గుర్తించి వివరాలు సమర్పించాలన్నారు. అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయం పట్టదా?

- మంచిర్యాల గోదావరి వద్దే బ్రిడ్జిని నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 22 : ప్రజల అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకుని వారు కోరుకున్నట్లుగానే మంచిర్యాల గోదావరి వద్దే హైలెవెల్ వంతెన నిర్మించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి నదిపై మంచిర్యాల - అంతర్గాంల మధ్యనే బ్రిడ్జి నిర్మిస్తే 18 కిలోమీటర్ల మేర దూరం తగ్గుతుందని, దీంతో ప్రజలకు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే వారందరికీ సమయం ఆదా అవుతుందని, ప్రయాణ వ్యయం కూడా తగ్గుతుందని చెప్పారు. అలాకాకుండా ముల్కల్ల నుంచి నిర్మిస్తే ప్రజలకు పెద్దగా లాభం ఉండదని, నిర్మాణ వ్యయం, భూసేకరణ, ఇతర పనులు చేపట్టేందుకు ఏళ్లు గడుస్తాయని తెలిపారు. ఇప్పటికే అంతర్గాం వైపు భూసేకరణ పూర్తి చేసుకున్నారని, టెండరు ప్రక్రియ పూర్తయిందని, ఈ ఎండాకాలంలోనే గోదావరిలో నీళ్లు లేని సమయంలో త్వరితగతిన వంతెన నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ముల్కల్ల వద్ద బ్రిడ్జి కడుతానని అంటున్నారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇక్కడి ప్రజల అభిప్రాయాలు ఆయనకు పట్టవా అని ప్రశ్నించారు. ముల్కల్ల దగ్గర నిర్మిస్తే 450 కోట్లు అవసరం ఉంటుందని, అదే ఇక్కడే కడితే కేవలం రూ. 164 కోట్లు ఖర్చు మాత్రమే అవుతుందన్నారు. పైగా ముల్కల్ల దగ్గర బ్రిడ్జి నిర్మిస్తే కేవలం ఐదు కిలోమీటర్ల దూరం మాత్రమే తగ్గుతుందని తెలిపారు. అక్రమంగా తిన్నది కక్కిస్తానని అంటున్నారని, 14 ఏళ్ల క్రితం నాయికినిపేట, మెట్‌పల్లి రైతుల భూములకు సంబంధించిన పరిహారం ఇప్పటివరకు ఇవ్వకుండా నొక్కేసింది ముందు కక్కమని హితవు పలికారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అంకం నరేశ్, శ్రీపతి శ్రీనివాస్, సుంకరి రమేశ్, మొగిలి శ్రీనివాస్, సిరిపురం శ్రీనివాస్, ఎర్రం తిరుపతి, తాజుద్దీన్, శ్రీరాముల మల్లేశ్ పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్

మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లి, మార్చి22 : పార్లమెంట్ ఎన్నికలు నిబంధనల ప్రకారం సజావుగా నిర్వహించాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి అదనపు కలెక్టర్లు దివాకర్, బీ రాహుల్, అరుణశ్రీతో కలిసి ఎన్నికల నిర్వహణపై ఏఆర్వోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల, రామగుండంవంటి అర్బన్ ప్రాంతాల్లో ఓటరు నమోదు పెరిగేలా ప్రత్యేక కార్యక్రమలు నిర్వహించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, సదుపాయాలు కల్పించాలన్నారు. పార్లమెంట్ పరిధిలో విధులు నిర్వహించే ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఇతర బృందాలకు అవసరమైన శిక్షణ అందించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అనుమానాస్పద లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు అధికారులకు అందించేలా చూడాలన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జరగాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఉద్యోగికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ హక్కు వినియోగించే అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో మంచిర్యాల, చెన్నూర్, మంథని, పెద్దపల్లి ఆర్డీవోలు, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.